క్లుప్తంగా

ఘనంగా హనుమాన్ పల్లకీసేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌదమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు రఘుపతి శర్మ, రాఘవేంద్రచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజలు కొన సాగాయి. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జైకిషన్ జవార్, సుశీల దంపతుల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలబట్ల పాండురంగం, దన్నుస్, హరిహరణ్‌కుమార్, రఘునందన్‌రెడ్డి, మల్లారెడ్డి, నర్సింలు, శ్రీశైలంగౌడ్, యంసాని నర్సింలు, రఘుగౌడ్, ఆశన్నగౌడ్, రాఘవేందర్‌గౌడ్, లక్ష్మణ్, బచ్చన్న, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో వరదనీటి నిల్వ



ప్రాంగణంలో నిల్వ ఉన్న వరద నీరు

కొత్తూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయి.. ఇళ్ల, రోడ్లపై వరద నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది డెంగీతో పాటు ఇతర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తరచూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాగా వాస్తవ పరిస్థితుల్లో మాత్రం ఆయా చోట్ల నీరు నిల్వ లేకుండా సరైన చర్యలు తీసుకోవడం లేదు. కొత్తూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఇటీవల కురిసిన వర్షానికి వరదనీరు చాలా రోజుల నుంచి నిల్వ ఉంది. పక్కనే తరగతి గదుల్లో విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు చదువుకుంటున్నారు. అయినా నీటి నిల్వను తొలగించడంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మొయినాబాద్: ప్రభుత్వం డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం బస్సు డ్రైవర్ల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఏర్పాటు చేసిన విధంగా డ్రైవర్లకు సైతం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. చాలీచాలని జీతాలతో డ్రైవర్లు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం డ్రైవర్లను ఆదుకోవాలని, వారికి రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో డ్రైవర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి శేఖర్, మల్లారెడ్డి, సుధాకర్, రాజు, బాలస్వామి, మహ్మద్ చాంద్‌పాషా, మహేందర్, గోరేమియా, మల్లేశ్, శ్రీనివాస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం'

షాబాద్: అర్హులైన రైతులందరికీ ఆగస్టులోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని షాబాద్ కాంగ్రెస్ పార్టీ బీసీ మండల అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచిందన్నారు. మిగిలిన పథకాలన్నీ త్వరలో అందరికీ అందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యా యం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని విమర్శించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి



సన్మానం పొందిన ఎంపీటీసీలతో ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీడీఓ హిమబిందూ

మండల సమావేశంలో ఎంపీపీ విజయలక్ష్మి

- ఎంపీటీసీలకు ఘన సన్మానం, మెమెంటోల అందజేత

చేవెళ్ల: ఐదేళ్ల అందరి సహాయ సహకారాలతోనే పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి కృషి చేశానని చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మిరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ముగిసిన అనంతరం వారు వీడ్కోలు సమావేశం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీ కాలం వచ్చేనెల 4వ తేదీతో ముగుస్తుండటంతో ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి దంపతులు ఎంపీటీసీలను ఘనంగా సన్మానిచారు.

సమస్యలపై చర్చ

ముందుగా నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులపై ఆయా శాఖల వారీగా చర్చించారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి నిధులు విడుదల చేయాలని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం విద్యుత్ సమస్యలతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా పరిష్కరించాలని పలువురు సభ్యులు విన్నవించారు. అనంతరం విద్యుత్ ఏఈ మాట్లాడుతూ.. మండలంలో పలు విద్యుత్ లైన్‌ల మరమ్మతులు ఉండటంతో ఎన్నికల సమయంలో చేయలేకపోయామని ఇప్పుడు ఆ పనులు చేపట్టడంతో విద్యుత్ ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. ప్రస్తుతం ఈ పనులు కూడా పూర్తి చేశామని ఇక నుంచి ఇబ్బందులు ఉండవన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి ముందస్తుగా సమాచారం అందించి మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలు, రైతుబంధు, రైతుబీమా రైతులందరికీ అందించేలా చూడాలని పలువురు సభ్యులు కోరారు. ఆయా శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనుల గురించి వివరించారు. సమావేశానికి రాని పలు శాఖల మండల, డివిజన్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ హిమబిందుకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవీ కాలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులందరి సహకారంతోనే మండలంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. పార్టీలు వేరువేరుగా ఉన్నా మండలంలోని ప్రజాప్రతినిధులందరూ అభివృద్ధి కోసం కలిసిమెలిసి పనిచేశారన్నారు. ఇదే స్ఫూర్తితో అందరూ పనిచేయాలని సూచించారు. ఎంపీపీ ఎం.విజయలక్ష్మిరమణారెడ్డి దంపతులు ఎంపీటీసీలందరికీ మెమోంటోలను అందించి శాలువాలు, పూలమాలతో సన్మానించారు. పలువురు ఎంపీటీసీలు ఎంపీపీ దంపతులను సన్మానించారు. మా గ్రామాల అభివృద్ధికి ఎంపీపీ అన్ని విధాలుగా సహకారం అందించారని ఎంపీటీసీలు పలువురు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హిమబిందూ, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, సూపరింటెంట్ రాజ్‌కుమార్, అధికారులు తులసి, రాఘుబాబు, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, ఎంపీటీసీలు వసంతం, రాములు, వనం మాధవి, స్వరూప, వాసవి, మమత, సుజాత, యాదమ్మ, కిష్టయ్య, రవీందర్‌రెడ్డి, నరేందర్‌చారి, సత్యనారాయణచారి, కావలి రవీందర్, కో–ఆప్షన్ సభ్యుడు బాబర్, అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పత్తి పంటల పరిశీలన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి

కొత్తూరు: రైతులు పత్తి సాగులో వ్యవసాయ అధికారులు సూచించే మెళకువలను పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త సుధారాణి అన్నారు. ఆమె శనివారం మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పర్యటించి పత్తిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పంట సాగులో రైతులకు ఆమె పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. విత్తుకోవడానికి ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అంతేకాకుండా సాగు తర్వాత చీడపీడల నివారణకు సేంద్రీయ ఎరువులను వినియోగించాలని కోరారు. రైతులు పాత పద్ధతులకు స్వస్తి చెబుతూ ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ముఖ్యంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడంతో రైతులు ఆర్థికంగా బలపడతారని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ దీపిక, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం



నరేందర్‌కు నగదు అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు

మొయినాబాద్‌రూరల్: పార్టీ కోసం అహర్నిషలు కృషి చేస్తున్న కార్యకర్తలకు ఆపదలో ఉన్నప్పుడు ఆర్థికంగా ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో గ్రామ అధ్యక్షుడు ఏనుగు మైపాల్‌రెడ్డి, నాయకులతో కలిసి జైపాల్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందిన అజీజ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అంతంగారి నరేందర్‌కు రూ.25వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలను నాయకులు ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా సాయం అందించేందుకు పార్టీ నాయకులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గుంటి నాగరాజు, ఎలిగని నరేందర్‌గౌడ్, మాడి జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- గెలిపించిన ప్రజలను ఎమ్మెల్యే యాదయ్య మోసం చేశారు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి

మొయినాబాద్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు కష్టపడి పని చేసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను గెలిపిస్తే కార్యకర్తలను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలిపించిన కార్యకర్తలకు ఒక్కమాట కూడా చెప్పకుండా ఎమ్మెల్యే యాదయ్య పార్టీ మారడం బాధాకరమన్నారు. ఎవరూ పార్టీ మారినా కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలమంతా పనిచేస్తామన్నారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని.. ఇప్పుడు వెళ్లిపోయినవారంతా అప్పుడు బాధపడే రోజు వస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌కు త్వరలోనే మంచి రోజులు వస్తాయన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ యువత విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రావూఫ్, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీహరియాదవ్, సుధాకర్‌యాదవ్, నాయకులు తిరుపతిరెడ్డి, సురేందర్‌గౌడ్, గణేశ్‌రెడ్డి, బిలాల్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఎక్కడ ఉంటే అక్కడే ఉండే వలసవాది

చేవెళ్ల: అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉండేందుకు పార్టీలు మారే వలసవాది ఎమ్మెల్యే కాలె యాదయ్య అని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్, మినిమం వేజ్ బోర్డు మాజీ చైర్మన్ నారాయణలు అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో శనివారం వారు ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్‌ఎస్ పార్టీని మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడంపై ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో తన కుటుంబానికి మొత్తం పదవులు ఇప్పించుకొని పార్టీని వాడుకున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పోవటం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యేకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు, గెలుపు కోసం పనిచేసిన పార్టీ శ్రేణులకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఆయనకు ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన ప్రభుత్వం అంటూ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పాలన చేస్తున్నారని దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఖచ్చితంగా మళ్లీ బీఆర్‌ఎస్ కేసీఆర్ ప్రభుత్వానికి మంచి రోజులు వస్తాయని పార్టీలో ఉండే నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, పుష్పాల రాజు, రాకేశ్, సందీప్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్, పృథ్వీ, ఎజాస్, అశోక్, అంజి, బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీటీసీ విజయ్‌కుమార్, విజయార్యక్షత్రియ, రాజమహేంద్రవర్మ, చందు, రాజు, తదితరులు ఉన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్: ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: సౌత్ గ్లాస్ పరిశ్రమ యజమానులపై హత్యనేరం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, యజమానుల నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సౌత్ గ్లాస్ పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనా స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారణమైన పరిశ్రమ యజమాని శైలేశ్ అగర్వాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేలుడు ఘటనలో బాధిత కార్మికుల కుటుంబాలకు తాము అండగా ఉంటామన్నారు. కార్మికులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మౌనిక, హరికృష్ణ, ప్రభాకర్, యాదయ్య, సంతోష్, రమేశ్, మాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను అండగా ఉంటాం

గ్లాస్ పరిశ్రమలో పేలుడు ఘటనలో మృతి చెందిన, గాయపడిన కార్మికులను, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ హామీనిచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు శనివారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను హైదరాబాద్‌లోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను ఎంపీ డీకే అరుణ బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్షతగాత్రులకు అందుతున్న సహాయక చర్యలు, చికిత్స గురించి స్థానిక పోలీసులను ఫోన్ ద్వారా ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు అండగా నిలుస్తామని భరోసానిచ్చారు.

పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.

కార్మికులకు న్యాయం చేయాలి

షాద్‌నగర్‌రూరల్: పొట్ట చేత పట్టుకొని పట్టెడన్నం కోసం వలస వచ్చిన కార్మికుల ప్రాణాలు యాజమాన్యాల నిర్లక్ష్యంతోనే గాలిలో కలిసి పోతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలతో కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం పేలుడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. పరిశ్రమలో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలో యాజమాన్యం నిర్లక్ష్యం కార్మికులకు శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశ్రమలో ప్రమాదం జరిగి కార్మికులు ప్రాణాలను కోల్పోతే వారిని ఆదుకోవాల్సిన యాజమాన్యం పత్తా లేకుండా పోవడమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించేది లేదని, యాజమాన్యంతో చర్చలు జరిపి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, నాయకులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

సౌత్ గ్లాస్ పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పరిశ్రమ యాజమాన్యం రూ.50లక్షల నష్టపరిహారాన్ని ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామ శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమను శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. యాజమాన్యంపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి చంద్రమోహన్, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సేవలు మరువలేనివి



ఆంజనేయులు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: మండలంలో ఎంపీడీఓ ఆంజనేయులు అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. శనివారం కొందుర్గు ఎంపీడీఓ ఆంజనేయులుకు పదవీ విరమణ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ప్రముఖ పాత్ర వహించేవారని గుర్తుచేశారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ఎంతో శ్రమించి అందరి వివరాలను ప్రభుత్వానికి నివేదించడంలో ఎంతో కృషిచేశాడన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు పార్టీలకతీతంగా పని చేస్తూ ప్రజలకు సేవలందించడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, సీఈఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ రంగారావు, డీఎల్‌పీఓ మాల్లారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధితోనే దేశ ప్రగతి

షాద్‌నగర్‌రూరల్: పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే దేశం ప్రగతిని సాధిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింతగూడ, ఎలికట్ట, మహాల్ ఎలికట్ట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి శ్రీశైలం, మాజీ సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పర్వతాపూర్‌లో..

కొందుర్గు: మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో శనివారం రూ.10లక్షలతో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమిపూజ చేశారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5లక్షలు, పైపులైన్‌కు రూ.5లక్షలు, అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణానికి రూ.8లక్షలు, సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.2లక్షలతో చేపట్టనున్న పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంజుల, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయం చేసే వారికే రైతుబంధు

మహాజన సభలో రైతుల అభిప్రాయాలు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ అశోక్

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు పెట్టుబడి సహాయంగా అందించే రైతుబంధు సహాయాన్ని గరిష్ఠంగా 30 ఎకరాల వరకు భూములు ఉన్న రైతులకు అందించాలని మెజార్టీ రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చేగూరులో పీఏసీఎస్ కేంద్రంలో చైర్మన్ గొర్లపల్లి అశోక్ అధ్యక్షతన శనివారం మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రైతుబంధు అమలు విషయమై రైతుల సూచనలు, సలహాలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. చేగూరు పీఏసీఎస్ పరిధిలోని డైరెక్టర్లు, రైతులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని, వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలని 5 మంది రైతులు, 10 ఎకరాల వరకు ఇవ్వాలని 5 మంది రైతులు తమ అభిప్రాయాలను చెప్పినట్లు వివరించారు. అదే విధంగా 3 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు మాత్రమే ఇవ్వాలని ఇద్దరు, 15 ఎకరాల నుంచి 30 ఎకరాల వరకు రైతుబంధు ఇవ్వాలని మెజార్టీ రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములకు రైతుబంధు ఇవ్వొద్దని మరి కొందరు సూచించారని పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు సీఈఓ వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, డైరెక్టర్లు నర్సింహ, నర్సింహ, మల్రెడ్డి, మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల: వాహనాలు నడిపించే ప్రతీ ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, వాహనాలకు నంబర్‌ప్లేట్ కనిపించకుండా ట్యాంపరింగ్ చేయటం చట్టరీత్యా నేరమని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అన్నారు. మండలంలోని దామరగిద్ద బస్‌స్టేజీ వద్ద శనివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలకు నెంబర్‌ప్లేట్ లేకుండా చాలా వాహనాలు తిరుగుతున్నాయని ఇలా తిరగటం కూడా నేరమేనన్నారు. నెంబర్‌ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని 10 వాహనాలను గుర్తించి సీజ్ చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ హెల్మెట్, సీట్‌బెల్ట్‌లు పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌రూల్స్‌ను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవటంతో జరిగే ప్రమాదాలలో ప్రాణాలు సైతం పోతున్నాయని గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు, పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.